E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 14-05-2025 (వారం) బుధవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




విద్యార్థులకు బిగ్ అలర్ట్.. సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల » 3లో



## 'మహా' గుడ్డి టౌన్ ప్లానింగ్...

### గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ లో అక్రమ నిర్మాణాల జాతర

**చేష్టలూడిగి చూస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగం**

**కొత్త 'బాస్' లైనా అక్రమ నిర్మాణాలను అడ్డుకునేనా..?**

ఈ కబురు, శేరిలింగంపల్లి : "" గ్రేటర్ హైదరాబాద్ మహా నగర మున్సిపల్ కార్పొరేషన్ లో టౌన్ ప్లానింగ్ విభాగం గుడ్డిదైంది. లోకమంతటికీ అక్రమ నిర్మాణాలు కనిపిస్తున్నా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల కు మాత్రం అవి కనిపించడం లేదు. జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా, అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను గుర్తించి అడ్డుకోవల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం, న్యాక్ అధికారులు చేష్టలు డిగి చూస్తుండడంతో హైటెక్ సర్కిల్ శేరిలింగంపల్లిలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ రికార్డుల్లో నేటికి ప్రభుత్వ భూమిగా ఉన్న గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ లో ఏ సందు చూసినా అక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో కొత్తగా పుట్టుకువస్తున్న అక్రమ నిర్మాణాలతో పాటు ఎన్నో ఏళ్లుగా ఉన్న పాత భవనాల మీద సైతం కొత్తగా అక్రమ అంతస్థులు వెలుస్తున్నాయి. మంచితరుణం మించినా దొరకదు అన్న చందంగా నిర్మాణదారులు ఏడాపెడా అక్రమ అంతస్థులకు తెరలేపుతూ గ్రేటర్ ఖజానాను భారీగా గండికొడుతున్నారు. ""

రాష్ట్రంలోనే హైటెక్ సర్కిల్ గా పేరు గాంచిన శేరిలింగంపల్లిలో ప్రస్తుతం అక్రమ నిర్మాణాల జాతర నడుస్తుంది. సర్కిల్ పరిధిలోని ఏ ప్రాంతం చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లిలో గల ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అడ్డుకునే వారే కరువయ్యారు. నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు, సిబ్బంది.. దండుకోవడమే ధ్యేయంగా పనిచేస్తుండడంతో అక్రమ నిర్మాణాలు ఈ ప్రాంతంలో అంతకంతకు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలకు సలహాదారులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు ఏ విధంగా చేపట్టాలో, నిర్మాణాలను ఏ విధంగా పూర్తి చేయాలో టౌన్ ప్లానింగ్ విభాగమే నిర్మాణదారులకు సలహాలు అందిస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. తరువాయి 2లో

## ప్రపంచమంతా మర్మోగిన ఆపరేషన్ సిందుర్



మరోసారి తెగించొద్దని పాకిస్తాన్‌కు లక్ష్మణరేఖ గీసి వచ్చారు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పోరాటపటిమను శ్లాఘించిన ప్రధాని మోదీ

దాయాది నడిబోడ్డున బాంబులు పేల్చారు

మీ మెరుపువేగం, కచ్చితత్వం శత్రువులను నిశ్చేష్టలను చేసింది

భారతీయులంతా మీ పోరాటానికి ఉప్పొంగిపోయారు.. ఇది ఎన్నటికీ తీర్చుకోలేని రుణం

పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో వాయుసేన జవాన్లనుద్దేశించి ప్రసంగం

ఈ కబురు:మంగళవారం పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో వాయుసేన జవాన్లతో కలిసి భారత్ మాతా కీ జై అంటూ నినదిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో రన్‌వేపై మిగ్–29 యుద్ధవిమానం, గగనతల రక్షణ వ్యవస్థ సుదర్శన చక్ర (ఎస్–400). ఎస్–400ను ధ్వంసం చేశామన్న పాక్ ప్రగల్భాలు ఉత్తమాటలని నిరూపిస్తూ మోదీ దాని ఎదుటే నిల్చుని ప్రసంగించారు.

తరువాయి 2లో



## మిస్ వరల్డ్ అందగత్తెలకు స్పెషల్ విందు... హాజరైన సీఎం రేవంత్ రెడ్డి

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 కాంపిటిషన్ స్టార్ట్ కాగా.. మంగళవారం (మే 13) అందాల భామలకు హైదరాబాద్ ఐకానిక్ ప్లేస్ చౌమొహల్లా ప్యాలెస్‌లో విందును ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. ప్రపంచ సుందరీమణులు చౌమొహల్లా ప్యాలెస్ అందాలను తిలకించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ విందుకు సీఎం రేవంత్ రెడ్డి దంపతులతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు, సినీ తారలు హాజరయ్యారు. హీరో నాగార్జున తదితర సినీ సెలబ్రెటీలు ఈ విందులో సందడి చేశారు. ఈ విందుకు ముందు.. ప్రపంచ సుందరీమణులు చార్మినార్ దగ్గర సందడి చేశారు. 109 దేశాల అందగత్తెలకు రెడ్ కార్పెట్ తో.. సంప్రదాయ అరబ్బీ మర్ఫా సంగీతంతో స్వాగతం పలికారు. చార్మినార్ అందాలను, చుట్టుపక్కల ప్రాంతాలను తమ సెల్ ఫోన్లలో బంధించుకున్నారు భామలు. ఆ తర్వాత చార్మినార్ దగ్గర ప్రత్యేక ఫోటో షూట్ నిర్వహించారు.

తరువాయి 3లో

## కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలి: కేటీఆర్



కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలని భారాస శ్రేణులకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. » 2లో

## హరీష్ రావుకు మంత్రి ఉత్తమ్ కౌంటర్




ఈ కబురు,హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లను వదిలేసి అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటరిచ్చారు. » 2లో



## రూ.6 కోట్ల ఫ్రాడ్ కేసులో ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్ రావు అరెస్ట్

» 3లో



## మే 14న వరంగల్ కు అందాల తారలు..వెయ్యి స్తంభాల గుడి,రామప్ప సందర్శన

» 3లో

## వేధింపులు, ఆధిపత్య ధోరణితో ఏకాకులవుతారు: జిన్‌పింగ్



తరువాయి 3లో



## ప్రత్యక్ష చర్చలు.. పుతిన్ కోసం వేచి చూస్తుంటా: జెలెన్‌స్కీ


తరువాయి 3లో

## తెలంగాణలో నాలుగు రోజులు భారీవర్షా లు..పది జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్



ఈ కబురు: తెలంగాణలో నాలుగు రోజులు భారీవర్షా లు..పది జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ గత కొద్ది రోజులుగాఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఎండలు రికార్డుస్థాయిలో నమోదు అవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం పది దాటిందంటే చాలు ఇండ్లనుంచి బయటికి వెళ్లే పరిస్థితి లేదు. ఈ క్రమంలో వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. రానున్న నాలుగు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షా లు కురుస్తాయని అంచనా వేసింది. » 3లో

## ట్రంప్ పశ్చిమాసియా పర్యటన మొదలు..!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా పర్యటన మొదలైంది. ఆయన నేడు రియాద్‌కు చేరుకొన్నారు.

ఈ కబురు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా నేడు సౌదీ అరేబియాకు చేరుకొన్నారు. ఆయనకు యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ స్వాగతం పలికారు. ట్రంప్ రెండో సారి అధికారం చేపట్టిన తర్వాత చేపట్టిన తొలి పెద్ద పర్యటన ఇదే. దీనిలో భాగంగా ఆయన సౌదీ, యూఏఈ, ఖతార్‌ను సందర్శించనున్నారు.

తరువాయి 3లో

## ఆధ్యాత్మిక గురువు ఆశీస్సులు తీసుకున్న కోహ్లీ, అనుష్క శర్మ

» 6లో




## మైక్రోసాఫ్ట్‌లో భారీగా లేఆఫ్‌లు.. వేలాదిమందిపై ప్రభావం!

» 4లో

## సైనికుల మాతృమూర్తులకు కంటిమీద కునుకుండదు: అలియాభట్

» 5లో



మొదటి పేజీ తరువాయి

# 'మహా' గుడ్డి టౌన్ ప్లానింగ్...

## గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ లో అక్రమ నిర్మాణాల జాతర



సోఫా కాలనీలో నిర్మాణంలో ఉన్న అనుమతి లేని అపార్టుమెంటు



తాజ్ నగర్ లో కొనసాగుతున్న అక్రమ బహుళ అంతస్థుల భవనం



ఎన్టీఆర్ నగర్ లో పూర్తవుతున్న భారీ అక్రమ నిర్మాణం

రాష్ట్రంలోనే హైటెక్ సర్కిల్ గా పేరుగాంచిన శేరిలింగంపల్లిలో ప్రస్తుతం అక్రమ నిర్మాణాల జాతర నడుస్తుంది. సర్కిల్ పరిధిలోని ఏ ప్రాంతం చూసినా అక్రమ నిర్మాణాలే కనిపిస్తున్నాయి. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్ పల్లిలో గల ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అడ్డుకునే వారే కరువయ్యారు. నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు, సిబ్బంది.. దండుకోవడమే ధ్యేయంగా పనిచేస్తుండడంతో అక్రమ నిర్మాణాలు ఈ ప్రాంతంలో అంతకంతకు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలకు సలహాదారులుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలు ఏ విధంగా చేపట్టాలో, నిర్మాణాలను ఏ విధంగా పూర్తి చేయాలో టౌన్ ప్లానింగ్ విభాగమే నిర్మాణదారులకు సలహాలు అందిస్తున్నారనే ప్రచారం జరుగుతుంది.

### గోపన్ పల్లిలో అనుమతులు నిల్.. నిర్మాణాలు ఫుల్..

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్ పల్లి సర్వే నెంబరు 124 నేటికి ప్రభుత్వ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి. ఇక్కడ భవన నిర్మాణం చేపట్టేందుకు, కనీసం చిన్న గోడ కట్టేందుకు సైతం జీహెచ్ఎంసీ నుంచి అనుమతి లేదు. సర్వే నెంబరు 124 నిషేదిత జాబితాలో ఉండడంతో ఈ భూముల్లో రిజిస్ట్రేషన్లను సైతం నిలిపివేశారు. రెవెన్యూ రికార్డుల్లో నిషేదిత జాబితాలో ఉన్నా. జీహెచ్ఎంసీ అనుమతులు లేకపోయినా గోపనపల్లిలోని ఎన్టీఆర్ నగర్, తాజ్ నగర్, సోఫా కాలనీల్లో అక్రమ బహుళ అంతస్థుల భవనాలు యదేచ్ఛగా వెలుస్తున్నాయి. ప్రస్తుతం ఎన్టిఆర్ నగర్, తాజ్ నగర్, సోఫా కాలనీల్లో ఏ సందు చూసినా ఏడంతస్థులకు తగ్గకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ నుంచి ఎటువంటి అనుమతి లేకుండా కేవలం వంద, రెండు వందల గజాల స్థలంలో వెలుస్తున్న ఈ భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు టౌన్ ప్లానింగ్ అధికారులకు మాత్రం కనిపించడం లేదు. జీహెచ్ఎంసీ ఈ అక్రమ నిర్మాణాల పరిధిలో కోట్లాది రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తుండగా, నిర్మాణ అనుమతుల రూపంలో రావాల్సిన ఆదాయం మాత్రం పైసా రావడం లేదు. ఒక్కో భవనానికి లక్షల కొద్ది జీహెచ్ఎంసీ ఫీజును చెల్లించకుండా అక్రమ నిర్మాణదారులు యదేచ్ఛగా అపార్టుమెంట్లు, హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నారు.

### కొత్త 'బాస్' లు అడ్డుకునేనా...?

గ్రేటర్ ఆధాయానికి గండికొడుతూ పలువురు బడా బిల్డర్లు, అక్రమ నిర్మాణదారులు చేపడుతున్న ఈ అక్రమ నిర్మాణాల తంతును కొత్తగా వచ్చిన జీహెచ్ఎంసీ బాస్ లు అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోన్ జోనల్ కమీషనర్ గా ఐపిఎస్ అధికారి బాధ్యతలు స్వీకరించడం, సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సైతం కొత్త అధికారి బాధ్యతలు స్వీకరించడంతో గోపన్ పల్లిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల తంతుకు ఇప్పటికైనా అడ్డుకట్ట పడుతుందా అని స్థానికులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ స్థలం, జీహెచ్ఎంసీ నుంచి అనుమతి రాదనే బూచీ చూపిస్తున్న బడా బిల్డర్లు.. ఇక్కడి పేదల నుంచి తక్కువ ధరకు స్థలాలను హస్తగతం చేసుకొని, అధికారుల అండతో భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు, అపార్టుమెంట్లు, హాస్టల్ సముదాయాలు నిర్మిస్తున్నారు. జీరో పర్మిషన్ తో చేపడుతున్న ఈ భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలను అడ్డుకోవడంలో, చర్యలు తీసుకోవడంలో స్థానిక టౌన్ ప్లానింగ్ విభాగం, న్యాక్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా ఈ అక్రమ నిర్మాణాల మీద దృష్టిసారించాలని, అనుమతి లేకుండా ప్రమాదభరితంగా చేపడుతున్న నిర్మాణాల మీద చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎన్టీఆర్ నగర్ లో పాత భవనం మీద కొత్తగా అక్రమ అంతస్థులు



సోఫా కాలనీలో జీరో పర్మిషన్ తో ప్రారంభమైన నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

### కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలి: కేటీఆర్



ఈ కబురు,హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలని భారాస శ్రేణులకు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతుల ఆత్మహత్యలు, వారి సమస్యల పరిష్కారంపై రాబోయే రోజుల్లో భారాస విస్తృత పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో కేటీఆర్ హైదరాబాద్‌లో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు భరోసా చెల్లింపులు సక్రమంగా జరగకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో చూపిస్తున్న నిర్లక్ష్యంపై, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పార్టీ కార్యాచరణ ఉండబోతోందన్నారు. నిరుద్యోగులకు మాట ఇచ్చినట్లుగా నోటిఫికేషన్లు ఇవ్వకపోవడంతో పాటు ఇటీవల వెలుగుచూసిన ఉద్యోగ నియామకాల్లో అవకతవకలపై సమగ్ర వ్యూహంతో ప్రజా ఉద్యమాలు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత భారీ సభగా ఎల్కతుర్తి సభ నిలిచిపోతుందన్న కేటీఆర్.. విజయానికి కారణమైన ప్రతి కార్యకర్త, నేతకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర రాజకీయాలకు ఎప్పుడూ కేంద్ర బిందువు భారాస పార్టీయే అన్న ఆయన.. వరంగల్ సభ తర్వాత ప్రజలు, కార్యకర్తల్లో ఓ పాజిటివ్ ఎనర్జీ వచ్చిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలపై అలుపెరగని పోరాటం చేసే ఉత్సాహం కలిగిందని.. రాష్ట్ర ప్రజలకు ఏనాటికైనా భారాసనే శ్రీరామరక్ష అన్న సంగతి మరోమారు నిరూపితం అయిందని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

### హరీష్ రావుకు మంత్రి ఉత్తమ్ కౌంటర్

ఈ మేరకు ధాన్యం కొనుగోళ్ల లెక్కలను విడుదల చేశారు ఉత్తమ్. ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. 43. 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ప్రతి విషయంలో తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హరీష్ కు ఉత్తమ్ హితవు పలికారు. ఒకసారి హరీష్ లెక్కలు చూసి మాట్లాడితే మంచిదని సూచించారు. ధాన్యం రాశులు వదిలేసి.. అందాల రాశుల చుట్టూ..

సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు మరోసారి మండిపడ్డారు. ధాన్యం అమ్ముకోవడానికి రైతులు యుద్ధం చేస్తుంటే.. రేవంత్ మాత్రం అందాల పోటీల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ అందాల పోటీల్లో బిజీగా ఉన్నారంటూ సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ ధాన్యం రాశులు వదిలేసి అందాల రాశుల చుట్టూ తిరుగుతున్నారని చమత్కరించారు. రైతు సమస్యలపై సమీక్ష చేయడానికి సీఎం రేవంత్‌కు టైమ్ లేదని, రైతు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని హరీష్‌రావు వ్యాఖ్యానించారు.ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కౌంటరిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ లాగ కాదని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఇందిరమ్మ ఇండ్ల కోటా ఇస్తామన్నారు పొంగులేటి. ఇక ఏపీలో కలిసిన ప్రజల స్థానికతపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

# ప్రపంచమంతా మార్మోగిన ఆపరేషన్ సిందూర్



వాయుసేన వేగం, సత్తా చూసి పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు గడిపింది. సమరంలో నేరుగా పోరాడే దమ్ములేక వైమానిక స్థావరంలో పౌరవిమానాలను ముందు నిలిపి పాక్ వక్రబుద్ధిని ప్రదర్శించింది. అయినా వాయుసేన కచ్చితత్వంతో పాక్ సాయుధ సంపత్తి, వైమానిక స్థావరాలనే గురిచూసి కొట్టింది. - ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: దుష్టదేశ గగనతలాన్ని చీల్చుకుంటూ దూసుకెళ్లి ముష్కర మిన్నాగుల పుట్టలను నేలమట్టంచేస్తూ, దాయాదిదేశం యుద్ధం ఆపాలని కాళ్లబేరానికి వచ్చే స్థాయిలో శత్రువుల వైమానిక స్థావరాలను తుత్తునియలు చేసి తిరుగులేని ధైర్యసాహసాలను ప్రదర్శించిన భారత వాయుసేనను ప్రధాని మోదీ పొగడ్తల్లో ముంచెత్తారు. పాక్ సరిహద్దుకు కేవలం 100 కిలోమీటర్ల దూరంలోని పంజాబ్‌లోని ఆదంపూర్ వైమానిక స్థావరానికి స్వయంగా వెళ్లి అక్కడి వాయుసేన బలగాలపై ప్రధాని ప్రశంసల జల్లు కురిపించారు. వారి అసమాన పోరాట పటిమను భుజం తట్టి ప్రోత్సహించి పొగిడారు. తర్వాత అక్కడి ఎయిర్‌ఫోర్స్ జవాన్లనుద్దేశించి దాదాపు అరగంటపాటు ప్రసంగించారు. మరోసారి తెగించేందుకు దుస్సాహసం చేయొద్దని సరిహద్దు వెంట భారతవాయుసేన బలగాలు లక్ష్మణరేఖ గీశాయని మోదీ వ్యాఖ్యానించారు. ఆదంపూర్ వైమానిక స్థావరంలోని భారత అత్యంత అధునాతన గగనతల రక్షణ వ్యవస్థ అయిన సుదర్శన చక్ర(ఎస్-400) మిస్సైల్ లాంఛర్లను ముక్కలుచెక్కలు చేశామని పాక్ పలికిన ప్రగల్భాలన్నీ ఉత్తమాటలని నిరూపిస్తూ మోదీ మంగళవారం ఆ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ ఎదుటే నిలబడి ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ విజయంపై జాతినుద్దేశించి ప్రసంగించిన మరుసటి రోజే మోదీ ఎయిర్‌ఫోర్స్‌నుద్దేశిస్తూ మాట్లాడటం గమనార్హం. త్రిశూలం చిహ్నంతో ఉన్న ఎయిర్ కమాండ్ క్యాప్ ధరించి భారత్ మాతా కీ జై అంటూ ప్రధాని ప్రసంగం ప్రారంభించారు. ‘‘పాక్ గడ్డపై మీరు చేసిన యుద్ధం అనుపమానం. అపూర్వం. అసాధారణం. అద్భుతం. పాకిస్తాన్ నడిబొడ్డున బాంబులు పేల్చారు. కేవలం 20-25 నిమిషాల్లో లక్ష్యాలను నేలమట్టంచేశారు. మీ మెరుపువేగం, కచ్చితత్వం శత్రువులను నిశ్చేష్టులను చేసింది. చూసుకునేలోపే ఛాతీని చీల్చేశాం. మీ పోరాటంతో ప్రతి ఒక్క భారతీయుడు గౌరవంతో ఉప్పొంగిపోయాడు. మేం మీకు రుణపడిపోయాం. ఇది ఎన్నటికీ తీర్చుకోలేని రుణం. ఊహకందనంతటి శక్తియుక్తుల్ని ప్రదర్శించి దేశానికి విజయం చేకూర్చిన మీ నుంచి ఆశీస్సులు తీసుకోవడానికే నేను వచ్చా. ఆపరేషన్ సిందూర్ ధాటికి ఇక లక్ష్మణరేఖ దాటొద్దని పాకిస్తాన్‌కు బాగా అర్థమైంది. తరచూ అణుబాంబులతో బెదిరించాలని చూస్తున్న దాయాదికి మన బలగాలు భారత్ మాతాకీ జై నినాదంలోని అపారశక్తిని బయటకు తీసి చూపారు. భారత్ మాతాకీ జై అనేది కేవలం నినాదం కాదు. దేశం కోసం తమ ప్రాణాలనైనా పణంగా పెడతామని బలగాలు చేసిన ప్రతిజ్ఞ. మన డ్రోన్లు, క్షిపణుల మోత పాక్ గడ్డపై ప్రతిధ్వనించిన ప్రతిసారీ పాకిస్తాన్ సైనికుల చెవుల్లో భారత్ మాతాకీ జై అనే నినాదమే మార్మోగింది. వాయుసేన శౌర్యం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. మన సైనిక, వాయు, నావికా దళాలకు నా సెల్యూట్’’ అంటూ మోదీ సెల్యూట్ చేశారు. ‘‘భారత గడ్డపై కన్నేస్తే తాము కనుమరుగు అవడం ఖాయమని ఉగ్రపోషకులకు ఆపరేషన్ సిందూర్ తర్వాత బాగా గుర్తుంటుంది. మీ పరాక్రమంతో ఆపరేషన్ సిందూరం నినాదం ప్రపంచమంతా మార్మోగుతోంది. శత్రువులు ఈ ఎయిర్‌ఫోర్స్‌ను నాశనంచేద్దామని కంకణం కట్టుకుని ఎడాపెడా దాడులు చేశారు. వాళ్ల ప్రయత్నాలను మీరు సులభంగా వమ్ముచేశారు. మన వైమానిక స్థావరాలు, రక్షణ మౌలిక సదుపాయాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో వాళ్ల 9 కీలక ఉగ్రస్థావరాలను సమాధులుగా మార్చేశాం. 100 మందికిపైగా ముష్కరులను మట్టుపెట్టాం. పాక్‌కు చెందిన ఎనిమిది సైనిక స్థావరాలను నాశనం చేశాం. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా భారత్ గీసిన లక్ష్మణరేఖ ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోంది’’ అని అన్నారు. ‘‘ధర్మ సంస్థాపనే లక్ష్యంగా శత్రు సంహారం కోసం ఆయుధం చేతబట్టి యుద్ధంచేయడం భారతీయుల సంప్రదాయం. మన అక్కచెల్లెళ్ల, కుమార్తెల పసుపు కుంకుమలు, సిందూరాన్ని తుచ్ఛమైన ముష్కరులు తుడిచేయగానే మనం వాళ్ల నట్టింట్లోకి వెళ్లి మరీ నాశనం చేశాం. కనీసం పారిపోయే అవకాశం కూడా ఇవ్వలేదు. పహల్గాంలో వాళ్లు దొంగదెబ్బ తీస్తే మనం మాత్రం నేరుగా వెళ్లి, ఎదురునిలిచి పోరాడాం. పాకిస్తాన్ సైన్యం చంకనెక్కి భద్రంగా ఉండొచ్చని ఇన్నాళ్లు ఉగ్రవాదులు భావించారు. కానీ మన బలగాలు ఇక పాక్‌లో ఉగ్రవాదానికి సురక్షిత స్థలమంటూ ఏదీ లేదని నిరూపించాయి. సూర్యోదయం వేళ మీ సుందర దర్శనం చేసుకునేందుకే నేను ఇక్కడికొచ్చా. మీరు ఈ తరానికే కాదు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాతలు. మరోసారి సాహసిస్తే నాశనం, వినాశనం అని శత్రువులకు సందేశం ఇచ్చారు. భారత్ మాతాకీ జై అన్నప్పుడల్లా భయంతో శత్రువుల గుండెలు జారిపోయాయి. పరాక్రమవంతుల అడుగులతో నేల కూడా పులకిస్తుంది. అంతటి ధైర్యవంతులను నేరుగా చూడటంతో జన్మ ధన్యమవుతుంది. ఆ భాగ్యం కోసమే నేను ఇక్కడికొచ్చా. వీరుల నేలపై నిలబడి ఇప్పుడు నేను ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ, బీఎస్ఎఫ్‌లోని యోధులకు సలామ్ చేస్తున్నా. మీ వీరత్వంతో ఆపరేషన్ సిందూర్ నినాదం నేల నలుచెరుగులా ప్రతిధ్వనిస్తోంది’’ అంటూ బలగాలను మోదీ పొగిడారు. ‘‘ఇప్పుడు భారత్ మూడే సూత్రాలతో ముందుకెళ్తోంది. ఒకటి.. ఉగ్రదాడి జరిగితే మనదైన శైలిలో సమయం చూసి దీటుగా బదులిస్తాం. రెండు.. అణుబాంబులకు భయపడేదే లేదు. మూడు.. ఉగ్రవాదాన్ని వాళ్లను, ఉగ్రవాదాన్ని జాతీయవాదంగా మార్చేసిన ప్రభుత్వాలను ఇకపై భారత్ వేర్వేరుగా చూడబోదు’’ అని మోదీ స్పష్టంచేశారు. ఆదంపూర్ ఎయిర్‌బేస్ అనేది దేశంలోని రెండో అతిపెద్ద వైమానిక స్థావరం. ఇక్కడ అత్యంత అధునాతన రఫేల్, మిగ్-29 యుద్ధవిమానాల స్క్వాడ్రన్ దళాలు ఉంటాయి. 1965, 1971 యుద్ధాల్లోనూ ఆదంపూర్ వైమానిక స్థావరం అత్యంత కీలకపాత్ర పోషించింది. ‘‘వాయుసేన ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణుల వేగం, సత్తా చూసి పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు గడిపింది. సమరంలో నేరుగా పోరాడే దమ్ములేక వైమానికస్థావరంలో పౌరవిమానాలను ముందు నిలిపి పాక్ తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. అయినాసరే మన వాయుసేన అత్యంత కచ్చితత్వంతో పాక్ సాయుధ సంపత్తి, వైమానిక స్థావరాలనే గురిచూసి కొట్టింది. అమాయక పౌరులకు ఏ హానీ తలపెట్టలేదు. ఒక్క పౌరవిమానాన్నీ మీరు ధ్వంసంచేయలేదు. ఈ విషయంలో నేను నిజంగా గర్వపడుతున్నా. దాడుల్లో మీరు శత్రు స్థావరాలు, ఉగ్రశిబిరాలనే కాదు మరోసారి దుస్సాహసం చేయాలనే దుర్బుద్ధినీ దెబ్బతీశారు. గగనతల, భూతల యుద్ధ వ్యవస్థల మధ్య అద్భుతమైన సమన్వయం సాధించారు. మానవ యుక్తిని మెషీన్ శక్తిని చక్కగా మేళవించారు.

## ప్రతి బస్తీ, కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి : గంగాధర్ రెడ్డి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి




స్థానికులతో చర్చిస్తున్న కార్పొరేటర్

### సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి అన్నారు. కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రజలకు పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్ రామగూడలో 68 లక్షల రూపాయల నిధులతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిశీలించారు. జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, స్థానికులతో కలిసి పనులను పరిశీలించిన గంగాధర్ రెడ్డి రహదారి నిర్మాణంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా పూర్తి ప్రమాణాలను పాటించాలన్నారు. రహదారి నిర్మాణంపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. భవిష్యత్తులో కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలి డివిజన్ లో ప్రణాళిక బద్దంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గచ్చిబౌలి డివిజన్ లో పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. గచ్చిబౌలి డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రషీద్, గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివ సింగ్, సీనియర్ నాయకులు కైలాష్ సింగ్, సుమన్, శ్రీకాంత్ రెడ్డి, బాబ్లీ సింగ్, గోపాల్ ,గణేష్ సింగ్, రంజిత్ సింగ్, విశాల్, విక్కీ,శంకేష్, శ్రీను, కిషోర్ సింగ్, బీరేందర్ సింగ్, నిరంజన్ గౌడ్, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## డిప్రెషన్ తో బాధపడుతున్న యువకుడు ఆత్మహత్య



ఈకబురు, శేరిలింగంపల్లి : గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ డిప్రెషన్ కి లోనైన యువకుడు తాను నివాసం ఉండే అపార్ట్మెంట్ 11వ ఫ్లోర్ నుండి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు చెందిన కేశవ్ శెట్టి కుమారుడు గౌతమ్ శెట్టి(29) తన తల్లిదండ్రులతో కలిసి గచ్చిబౌలిలోని మై హోమ్ విహంగ గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్నాడు. తన తండ్రికి చెందిన వ్యాపారాలను చూసుకుంటున్నాడు. గత ఆరు నెలల నుండి అనారోగ్య సమస్యల కారణంగా డిప్రెషన్ తో బాధపడుతున్నాడు. సోమవారం తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి నిద్రపోయాడు. మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉండగా గౌతమ్ శెట్టి తాను నివాసం ఉంటున్న భవనం 11వ అంతస్థు నుంచి కిందకు దూకాడు. భారీ శబ్దం రావడంతో సెక్యూరిటీ సిబ్బంది, అపార్ట్మెంట్ వాసులు బయటికి వచ్చి చూడగా గౌతమ్ శెట్టి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మిస్ వరల్డ్ అందగత్తెలకు స్పెషల్ విందు... హాజరైన సీఎం రేవంత్ రెడ్డి



ఈ విందుకు ముందు.. ప్రపంచ సుందరీమణులు చార్మినార్ దగ్గర సందడి చేశారు. 109 దేశాల అందగత్తెలకు రెడ్ కార్పెట్ తో.. సంప్రదాయ అరబ్బీ మర్ఫా సంగీతంతో స్వాగతం పలికారు. చార్మినార్ అందాలను, చుట్టుపక్కల ప్రాంతాలను తమ సెల్ ఫోన్లలో బంధించుకున్నారు భామలు. ఆ తర్వాత చార్మినార్ దగ్గర ప్రత్యేక ఫొటో షూట్ నిర్వహించారు. అనంతరం లాడ్ బజార్ లోని తొమ్మిది ప్రముఖ దుకాణాల్లో ఈ సుందరీమణులు షాపింగ్ చేశారు. గాజులు, ముత్యాల హారాలు, ఇంకా అలంకరణ వస్తువులు కొనుగోలు చేయడమే కాక.. అక్కడే గాజులు తయారీ విధానాన్ని కూడా స్వయంగా సుందరీమణులు పరిశీలించారు. నాలుగు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూప్ రెండు షాప్‌లలో షాపింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. అనంతరం చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్ వరకు హెరిటేజ్ వాక్ నిర్వహించారు. హెరిటేజ్ వాక్‌కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ విధించారు పోలీసులు. పహెల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాతబస్తీ వీధులన్నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మదీనా, చార్మినార్, శాలిబండ, వొల్గా జంక్షన్, ఖిల్వత్ రోడ్లను పూర్తిగా క్లోజ్ చేశారు. ఇవాళ రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

## తెలంగాణలో నాలుగు రోజులు భారీవర్షాలు..పది జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

సముద్రంలో అల్పపీడన ద్రోణి కారణంగా మంగళవారం(మే13) నుంచి నాలుగు రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం, బుధవారం, గురువారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలతో వర్షాలు కురిస్తాయని అంచనా వేసింది. మరికొన్ని జిల్లాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. రాగల మూడురోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్కర్నూల్ జిల్లాల్లో ఈదురు గాలులు గాలి వేగం గంటకు 4050 కి.మీతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే ఛాన్స్ ఉందని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో ఉరుములు, మెరుపులు,ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 3040 కి.మీ)తో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది.



## ట్రంప్ పశ్చిమాసియా పర్యటన మొదలు..!

నేటి ఉదయం ఆయన విమానం రియాద్‌కు చేరుకొంది. ట్రంప్ వెంట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్, ఇంధనశాఖ మంత్రి క్రిస్ రైట్ ఉన్నారు. పశ్చిమాసియా పర్యటన నాలుగు రోజుల పాటు జరగనుంది.

నేడు ట్రంప్ కోసం ఏర్పాటు చేసిన విందులో పలు కంపెనీల సీఈవోలు పాల్గొననున్నారు. వీటిల్లో అమెజాన్, ఎన్విడియా,ఓపెన్ ఏఐ,ఉబర్,కోకాకోలా,గూగుల్,బోయింగ్ సీఈవోలు ఉంటన్నారు. దీనికి టెస్లా సారథి మస్క్ కూడా హాజరుకానున్నారు. తాను తుర్కియేకు కూడా వెళ్లే అవకాశం ఉన్నట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఈ నెల 15 నుంచి ఉక్రెయిన్, రష్యా మధ్య చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పుతిన్, జెలెన్‌స్కీతో నేరుగా చర్చించే అవకాశాలున్నాయి. విమానం తాత్కాలికంగా బదిలీనే.. తనకు ఖతార్ రాజకుటుంబం అత్యంత విలువైన బోయింగ్ 737 విమానం గిఫ్ట్‌గా ఇవ్వనుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. మరోవైపు ఆ బహుమతి తీసుకోవడం అనైతికం.. అన్న అంశాన్ని ఆయన కొట్టిపారేశారు. దాదాపు 400 మిలియన్ డాలర్ల విలువైన విలాసవంతమైన విమానాన్ని కానుకగా అందించనున్నట్లు ప్రచారం మొదలైంది. దీనిని ఎయిర్ ఫోర్స్‌వన్ కింద వాడుకోవాలని ట్రంప్ ఆలోచిస్తున్నారు. ఇప్పటి వరకు అమెరికా అధ్యక్షులకు అందిన అత్యంత విలువైన బహుమతి ఇదే కావొచ్చు. దీనిని స్వీకరించడంపై వచ్చిన విమర్శలను తోసిపుచ్చారు. ''అంత ఉదారంగా ఖతర్ రాజకుటుంబం ఇచ్చే బహుమతిని వద్దనడానికి నేను మూర్ఖుడిని కాదు'' అని పశ్చిమాసియా పర్యటనకు వెళ్లే ముందు వ్యాఖ్యానించారు. చివర్లో దీనిని ప్రెసిడెన్షియల్ లైబ్రరీకి ఇచ్చేస్తానన్నారు. వ్యక్తిగత అవసరాలకు వాడుకొనే ఉద్దేశం లేదని తేల్చిచెప్పారు.మరోవైపు ఖతార్ ప్రతినిధి మాత్రం తాము విమానం ఇస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం సరికాదన్నారు. తాత్కాలికంగా ఓ విమానాన్ని బదిలీ చేసే అంశం మాత్రమే చర్చల్లో ఉందని వెల్లడించారు.



## ప్రత్యక్ష చర్చలు.. పుతిన్ కోసం వేచి చూస్తుంటా: జెలెన్‌స్కీ

**తుర్కియేలో పుతిన్‌తో ప్రత్యక్ష చర్చల కోసం వేచి చూస్తుంటానని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు.**

ఈ కబురు: యుద్ధం ముగింపుపై ప్రత్యక్ష చర్చల కోసం సిద్ధమేనని రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులు పుతిన్ , జెలెన్‌స్కీలు ప్రకటించిన విషయం తెలిసిందే. తుర్కియేలోని ఇస్తాంబుల్ వేదికగా గురువారం ఇరుదేశాల చర్చలకు పుతిన్ ప్రతిపాదించారు. ఈ క్రమంలోనే జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. ఆ రోజు తాను తుర్కియేలోనే రష్యా అధినేత కోసం వేచి ఉంటానని తెలిపారు. ఒకవేళ చర్చలకు రాకపోతే మాత్రం ఆయన యుద్ధాన్ని ముగించాలని కోరుకోవడం లేదన్న విషయం స్పష్టమవుతుందన్నారు.

''తుర్కియే రాజధాని అంకారాలో గురువారం ఆ దేశ అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో సమావేశమవుతాను. ప్రత్యక్ష చర్చలకు పుతిన్ రాక కోసం ఇద్దరం ఎదురుచూస్తాం. ఒకవేళ ఆయన ఇస్తాంబుల్‌కు వస్తే.. మేం కూడా అక్కడికి పయనమవుతాం. చర్చలకు రాకుండా ఆటలాడితే మాత్రం.. యుద్ధం ముగించాలన్న ఉద్దేశం ఆయనకు లేదన్నది స్పష్టమవుతుంది'' అని కీవ్‌లో జెలెన్‌స్కీ మీడియాతో మాట్లాడారు. పుతిన్ చర్చలకు హాజరు కాకపోతే.. మాస్కోపై మరిన్ని ఆంక్షలకు అమెరికా, ఐరోపా దేశాలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా.. చర్చలకు హాజరవుతారో లేదో పుతిన్ ఇంకా వెల్లడించలేదు. క్రెమ్లిన్ సైతం ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వలేదు. తమ అధ్యక్షుడు అవసరమని భావిస్తే దీనిపై ప్రకటన చేస్తామని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి పెస్కోవ్ తెలిపారు. మరోవైపు.. ఉక్రెయిన్‌పై రాత్రిపూట దాడులకు రష్యా కేవలం 10 డ్రోన్లే ప్రయోగించింది. ఈ ఏడాదిలో మాస్కో చేపట్టిన డ్రోన్ల దాడుల్లో ఇదే అతి చిన్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడితో ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు సన్నాహాలు జరుగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది.



## వేధింపులు, ఆధిపత్య ధోరణితో ఏకాకులవుతారు: జిన్‌పింగ్

**వేధింపులు, ఆధిపత్య ధోరణితో ప్రపంచవ్యాప్తంగా ఏకాకులుగా మిగులుతామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పేర్కొన్నారు.**

ఈ కబురు: వేధింపులు, ఆధిపృత ధోరణులు ప్రదర్శిస్తే.. ఒంటరిగా మిగిలిపోతారని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. వాషింగ్టన్‌బీజింగ్ మధ్య వాణిజ్య ఒప్పందంలో ముందడుగు పడటం.. టారిఫ్‌లకు తాత్కాలిక విరామం ఇచ్చిన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. వాణిజ్య యుద్ధాల్లో విజేతలు ఎవరూ ఉండరని పునరుద్ఘాటించారు. వివిధ దేశాలు కలిసి పనిచేస్తేనే ప్రపంచ శాంతి.. సుస్థిరత సాధ్యమన్నారు. బీజింగ్‌లో బ్రెజిల్, కొలంబియా, చిలీ దేశాధ్యక్షులతో జరిగిన భేటీలో ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇటీవల చర్చల సందర్భంగా టారిఫ్‌లను ఉపసంహరించుకోవడానికి అమెరికా, చైనా అంగీకరించాయి. వాణిజ్య వివాదాలను పరిష్కరించుకోవడానికి, మరిన్ని చర్చలు జరిపే నిమిత్తం టారిఫ్ యుద్ధానికి 90 రోజుల విరామం ఇస్తున్నట్లు ఇరుదేశాలు సోమవారం ప్రకటించాయి. సుంకాన్ని 115% మేర తగ్గించిన ఇరుదేశాలు చైనా వస్తువులపై టారిఫ్ రేటును 115% తగ్గించామని, దీంతో 145% సుంకం కాస్తా 30 శాతానికి పరిమితమైందని యూఎస్ ట్రేడ్ రెప్రెజెంటేటివ్ జేమిసన్ గ్రీర్ ప్రకటించారు. అమెరికా వస్తువులపై చైనా కూడా తన సుంకాన్ని అంతేస్థాయిలో తగ్గించడంతో.. 125% కాస్తా 10 శాతానికి పరిమితం అవుతోంది. జెనీవాలో గ్రీర్, అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు.

వాస్తవానికి ట్రంప్ టారిఫ్‌లు విధించిన వేళ చైనా కూడా వెనక్కి తగ్గకుండా.. అమెరికా వస్తువులపై సుంకాలు వేసింది. అమెరికా వేధింపులకు ఎదురొడ్డి నిలిచిన దేశం వలే తనను తాను ప్రపంచానికి చూపించేందుకు ప్రయత్నించింది.



## విద్యార్థులకు బిగ్ అలర్ట్.. సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల



ఈ కబురు: సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల అయ్యాయి. ఈ ఫలితాలను అధికారులు విడుదల చేసి వెబ్ సైట్‌లో అందుబాటు లో ఉంచారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 2024-25 విద్యా సంవత్సరానికి 10 12 తరగతుల బోర్డు పరీక్షలను నిర్వహించింది. భారతదేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కలిపి మొత్తం 24 లక్షలకు పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో 88.39 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో అత్యధికంగా విజయవాడ రీజీయన్‌లో 99.60 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరంతో పోలిస్తే 0.41 శాతం ఉత్తీర్ణత పెరిగింది. కాగా తాజా ఫలితాల్లో అత్యధికంగా విజయవాడ రీజీయన్ లో 99.60 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే తిరువనంతపురంలో 99.32, చెన్నైలో 97.39, బెంగళూరులో 95.95, ఢిల్లీ వెస్ట్ లో 95.37, ఢిల్లీ ఈస్ట్ లో 95.06, అత్యల్పంగా ప్రయాగ్ రాజ్ లో 79.53 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా ఈ సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు 2025 ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు జరిగాయి.

## రూ.6 కోట్ల ఫ్రాడ్ కేసులో ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్ రావు అరెస్ట్



ఈ కబురు,హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక నిందితుడు శ్రవణ్ రావు అరెస్ట్ అయ్యారు. ఓ చీటింగ్ కేసులో శ్రవణ్ రావును సీసీఎస్ పోలీసులు మంగళవారం (మే 13) రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం అతడిని మేజిస్ట్రేట్ ఇంటికి తరలించారు పోలీసులు. కాగా, అఖండ ఎంటర్ప్రైజెస్‌కి రూ.6 కోట్లు మోసం చేశారని శ్రవణ్ రావుపై సీసీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. కంపెనీకి సరుకు సరఫరా చేయకుండానే శ్రవణ్ రావు డబ్బులు తీసుకున్నారనేది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ ఎదుర్కొంటున్న శ్రవణ్ రావుకు..రూ.6 కోట్ల ఫ్రాడ్ కేసులో మంగళవారం (మే 13) విచారణకు రావాలని సీసీఎస్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోలీసుల నోటీసుల మేరకు శ్రవణ్ రావు మంగళవారం విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం శ్రవణ్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం మేజిస్ట్రేట్ ఇంటికి తరలించారు.

**ఫోన్ ట్యాపింగ్ సమయంలో రెండు సెల్ ఫోన్లు..!**

గత ప్రభుత్వ హయాంలో ట్యాపింగ్‌కు గురైన ఫోన్ నంబర్లు..వాటిని ప్రణీత్ రావు టీమ్‌కు పంపించిన మొబైల్ ఫోన్ నంబర్ల ఆధారంగా.. ట్యాపింగ్‌లో శ్రవణ్ రావు పాత్రను సిట్ అధికారులు గుర్తించారు. ఫోరెన్సిక్ రిపోర్ట్స్ ఆధారంగా ఫోన్ నంబర్లతో లింకైన ఐఎంఈఐ నంబర్లు గుర్తించారు. వీటిలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో శ్రవణ్ రావు నంబర్ నుంచి వెళ్లిన వాట్సాప్ చాటింగ్‌లు, ప్రణీత్ రావుకు ఆయన పంపించిన మొబైల్ నంబర్లను గుర్తించి శ్రవణ్ రావుపై కేసు నమోదు చేసింది సిట్.

## మే 14న వరంగల్ కు అందాల తారలు..

### వెయ్యి స్తంభాల గుడి,రామప్ప సందర్శన



**ఈ కబురు:మే 14న వరంగల్ కు అందాల తారలు..వెయ్యి స్తంభాల గుడి,రామప్ప సందర్శన**

మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ మే 14న వరంగల్ వెళ్లనున్నారు. వెయ్యిస్తంభాల గుడి, ఫోర్ట్, యునెస్కో వారసత్వ సంపద అయిన రామప్ప ఆలయాన్ని సందర్శించి, అక్కడే పేరిణీ నృత్యాన్ని తిలకించనున్నారు. వరంగల్లోని వేయి స్తంభాల గుడి కాకతీయుల కళాత్మక, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఒక అద్భుత కట్టడం. తెలంగాణలోనే అత్యంత పురాతమైన దేవాలయంగా పేరు గాంచింది. ఈ ఆలయం 2021లో యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు పొందింది. ఓరుగల్లులో 4.35 నుంచి 9 గంటల వరకు..ఉమ్మడి వరంగల్ పర్యటనలో భాగంగా మే 14న మిస్ వరల్డ్ బ్యూటీస్ 56 మందితోపాటు వారి కేర్‌టేకర్లున్నారు. జిల్లాలో మొత్తం పర్యటన దాదాపు 4.30 గంటల నుంచి 5 గంటల్లో పూర్తి కానుంది. 14న సాయంత్రం 4.35 గంటలకు హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ చేరుకుంటారు. వారికి సాంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలుకుతారు. 5.30 హోటల్ నుంచి బస్సు ద్వారా రెండు బ్యాచ్‌లుగా విడిపోయి 30 మంది రామప్ప టెంపుల్, మరో బ్యాచ్ వెయ్యిస్తంభాల గుడి, ఖిలా వరంగల్ పర్యటనకు వెళ్తారు. ఇది ముగిశాక రాత్రి 7.55 నుంచి 8.15 మధ్యన రెండు గ్రూపులు తిరిగి హరిత హోటల్ చేరుకుంటాయి. మటన్, నాటుకోడి చికెన్, బోటి, తలకాయ, పాయ వంటి తెలంగాణ స్పెషల్ వంటకాలతో డిన్నర్ అనంతరం సుమారు 9 గంటలకు హైదరాబాద్ తరలివెళ్తారు. వరంగల్ పర్యటన నేపథ్యంలో అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఖిల్లా వరంగల్ దగ్గర ఏర్పాట్లను పరిశీలించారు వరంగల్ జిల్లాల కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పోలీస్ అధికారులు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ షో బోట్, పలు శాఖల అధికారులతో ఏర్పాట్లు పరిశీలించారు. హరిత కాకతీయ, వేయి స్తంభాల దేవాలయం, ఖిలా వరంగల్ దగ్గర భారీ ఏర్పాట్లు చేశారు. మూడు చోట్ల పకడ్బందీగా ఏర్పాట్లు ఉండాలని, ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించార కలెక్టర్ సత్య శారద.

యాదగిరిగుట్ట, పోచంపల్లి

15వ తేదీన యాదగిరిగుట్టను సందర్శించనున్నారు. పోచంపల్లిలోని చేనేత వస్త్రాల తయారీని తెలుసుకోవడంతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తారు. ఈ వస్త్రాలు, ముఖ్యంగా ఇక్కత్ (ఇకత్) చీరలు, సంప్రదాయ జ్యామితీయ నమూనాలు..అద్భుతమైన నేత కళకు ప్రసిద్ధి. అందాల తారలు అత్యంత ప్రసిద్ధి గాంచిన ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు తిలకించేలా ప్రభుత్వం ప్లాన్ చేసింది. తద్వారా తెలంగాణ ప్రపంచానికే పరిచయం చేసేలా ప్రభుత్వం పకడ్బందీగా

## చార్మినార్ కే అందం తెచ్చిన మిస్ వరల్డ్ భామలు



ఈ కబురు : మిస్ వరల్డ్ అందగత్తెలు నేడు హైదరాబాద్ లోని చారిత్రాత్మక కట్టడం చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ చేశారు. ప్రపంచ సుందరీమణులు అంతా ఒక్క చోట కూడి చార్మినార్ కే వన్నెలు దిద్దారు. హెరిటేజ్ వాక్ వచ్చిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు సంప్రదాయ అరబ్బీ, మర్ఫా సంగీతంతో కళాకారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారంతా చార్మినార్ పరిసరాల్లో తిరుగుతూ సందడి చేశారు. చార్మినార్ వద్ద ఫోటోలు, సెల్ఫీలతో హల్ చల్ చేస్తూ మైమరచి పోయారు. చార్మినార్ చరిత్రను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ కట్టడం ముందు అందగత్తెలు గ్రూప్ ఫోటో దిగారు. చార్మినార్ సమీపంలోని చుడీ బజారులో ఎంపిక చేసిన తొమ్మిది దుకాణాల్లో వివిధ రకాల గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వస్తువుల షాపింగ్ నిర్వహించారు.

మరికాసేపట్లో వీరంతా సుప్రసిద్ధ చౌహముల్లా ప్యాలెస్ లో ఏర్పాటుచేసిన ప్రత్యేక విందుకు హాజరవనున్నారు. కాగా అక్కడ మిస్ వరల్డ్ కాంటెస్టర్లకు మెహెంది వేయడానికి ప్రత్యేక ఏర్పాటు చేశారు. చౌముల్లా ప్యాలెస్ లో నిజాం హయాంలో ఉపయోగించిన యుద్ధ ఆయుధాలు, గృహోపకరణ సామాగ్రి, నిజాం నవాబులు ఉపయోగించిన వివిధ రకాల వస్తువులు, ఓల్డ్ సిటీ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేసే ఫోటో ప్రదర్శనలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చార్యల్లో భాగంగా.. చార్మినార్ పరిసరాల్లోని చిల్లర వర్తక దుకాణాలు మూసివేయించారు.




## ప్రైమ్ వీడియోలో ఇక యాడ్స్.. వద్దనుకుంటే అదనంగా చెల్లించాల్సిందే!

ప్రైమ్ వీడియో యూజర్లకు వచ్చే నెల నుంచి యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. జూన్ 17 నుంచి ప్రకటనలు కనిపిస్తాయని కంపెనీ వెల్లడించింది.

ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో యూజర్లకు అలర్ట్. ప్రైమ్ వీడియోలో ఇకపై యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. వచ్చే నెల నుంచి సినిమాలు, షోల మధ్యలో ప్రకటనలు కనిపించనున్నాయి. ప్రకటనల్లేని వీడియో స్ట్రీమింగ్ సేవలు పొందాలంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు యూజర్లకు ఇమెయిల్స్ పంపిస్తోంది.

అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ మధ్యలో ప్రస్తుతం ఎలాంటి యాడ్స్ కనిపించడం లేదు. జూన్ 17 నుంచి మాత్రం పరిమితి సంఖ్యలో యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. మెరుగైన కంటెంట్‌ను అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెజాన్ యూజర్లకు పంపిన మెయిల్స్‌లో పేర్కొంది. సంప్రదాయ టీవీ ఛానెళ్లు, ఇతర మాధ్యమాల మాదిరిగా కాకుండా 'అర్థవంతమైన' యాడ్స్ మాత్రమే ప్రదర్శిస్తామని తెలిపింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్ షిప్ ధరలో ఎలాంటి మార్పులూ చేయడం లేదని పేర్కొంది.

రూ.399కే బ్రాడ్‌బ్యాండ్+ డీటీహెచ్.. ఎయిర్‌టెల్ బ్లాక్ కొత్త ప్లాన్ యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ కోరుకునే వారి కోసం కొత్తగా రెండు ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్నవారు నెలవారీ రూ.129, ఏడాదికి రూ.699 చొప్పున యాడ్‌ఆన్ ప్లాన్స్ తీసుకుంటే ఎలాంటి ప్రకటనలూ కనిపించవని తెలిపింది. జూన్ 17 నుంచి ఈ ప్యాక్స్ అందుబాటులోకి రానున్నాయని పేర్కొంది. గతంలో ఆస్ట్రేలియా, కెనడా, మెక్సికో, యూకే, యూఎస్ వంటి దేశాలకే పరిమితమైన యాడ్స్‌ను తాజాగా భారత్‌కూ తీసుకొచ్చింది. ప్రైమ్‌లైట్ ప్లాన్ తీసుకున్న వారికి ఇప్పటికే యాడ్స్ వస్తున్నాయి.






## లాభాల ఆనందం ఒక్కరోజే.. భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ దాదాపు 1281 పాయింట్లు, నిఫ్టీ 346 పాయింట్లు చొప్పున నష్టపోయాయి.**

**ముంబయి:** భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో నిన్న దూసుకెళ్లిన మన సూచీలు.. నేడు భారీ నష్టాలు చవిచూశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇందుకు కారణం. ముఖ్యంగా అధిక వెయిటేజీ కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్ వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 24,600 స్థాయి దిగువకు చేరింది.

సెన్సెక్స్ 82,249.60 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,429.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 81,043.69 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1281.68 పాయింట్ల నష్టంతో 81,148.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346.35 పాయింట్ల నష్టంతో 24,578.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

**కారణాలు ఇవే..**

నాలుగేళ్లలో ఎన్నడూ లేని రీతిలో నిన్న సెన్సెక్స్, నిఫ్టీ దూసుకెళ్లాయి. కానీ, ఎఫ్‌ఐఐ, డీఐఐలు కలిపి కొనుగోలు చేసింది రూ.2694 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు మాత్రమే. రిటైల్, హెచ్ఎన్ఐల కొనుగోళ్లు జరిపారు. ఈ నేపథ్యంలో నేడు గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. అమెరికాచైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయంగా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. కానీ మన మార్కెట్‌కు నెగిటివ్‌గా మారింది. ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే భారత్‌కు పరోక్షంగా లాభమన్న అంచనాలు ఇన్నాళ్లు ఉన్నాయి. తాజా పరిణామాలు కొంతమేర దాన్ని నీరుగార్చాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ 65 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది.చమురు దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూల అంశం కావడం కూడా సూచీల నష్టాలకు మరో కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ కలిసి సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు క్షీణించడంలో భూమిక పోషించాయి. ఐటీ స్టాక్స్‌లోనూ లాభాల స్వీకరణతో టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

## మైక్రోసాఫ్ట్‌లో భారీగా లేఆఫ్‌లు.. వేలాదిమందిపై ప్రభావం!

ప్రముఖ టెక్ సంస్థ 'మైక్రోసాఫ్ట్' ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించనున్నట్లు సమాచారం. ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ పెద్దఎత్తున ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ప్రకటించనున్నట్లు సమాచారం. ఈ నిర్ణయంతో వేలాదిమంది ఉద్యోగులపై ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు అంచనా. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు కానుంది. గతేడాది జూన్ నాటికి ఆ సంస్థలో 2.28 లక్షల మంది సిబ్బంది ఉన్నారు. ''మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూనే ఉంటాం'' అని మైక్రోసాఫ్ట్ ప్రతినిధి 'సీఎన్‌బీసీ'కి తెలిపారు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని చెప్పారు. మైక్రోసాఫ్ట్ తాజా నిర్ణయంతో మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ ఉద్యోగులపై అధిక ప్రభావం పడనుందని అంచనా. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది జనవరిలో పనితీరు ఆధారంగా కొంత మందిని సంస్థ తొలగించింది. అయితే, తాజా లేఆఫ్‌లకు, ఉద్యోగుల పనితీరుకు సంబంధం లేదని స్పష్టం చేసింది.




## మోటో నుంచి లక్ష రూపాయల ఫోల్డబుల్ ఫోన్




మోటోరొలా కొత్త ఫోల్డబుల్ ఫోన్ రేజర్ 60 అల్ట్రాను భారత్‌లో లాంచ్ చేసింది.

ప్రముఖ మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ మోటోరొలా కొత్త ఫోల్డబుల్ ఫోన్‌ను దేశీయ మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇప్పటికే మడత ఫోన్లలో సత్తా చాటుతున్న సంస్థ తాజా స్మార్ట్‌ఫోన్ లాంచ్‌తో తన పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తోంది. మోటోరొలా రేజర్ 60 అల్ట్రా పేరిట లాంచ్ చేసింది. మోటోరొలా రేజర్ 60 అల్ట్రా.. 7 అంగుళాల pOLED ఎల్‌టీపీఓ డిస్‌ప్లేతో వస్తోంది. 165Hz రిఫ్రెష్ రేటు, 4,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగిఉంటుంది. ఔటర్ డిస్‌ప్లే 4 అంగుళాల pOLED ఎల్‌టీపీఓ, 3,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ సిరామిక్ ప్రొటెక్షన్‌తో తీసుకొచ్చారు. స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ప్రాసెసర్ కలిగిఉంటుంది. ఆండ్రాయిడ్ 15 ఆధారిత హల్లో యూఐతో పనిచేస్తుంది. మూడేళ్లపాటు ఓఎస్, నాలుగేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్లు అందిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. మోటో ఏఐ 2.0 ఫీచర్లతో తీసుకొస్తున్నారు.

ఫోల్డబుల్ ఫోన్ కెమెరా ఫీచర్ల విషయానికొస్తే.. ఇందులో 50 ఎంపీ ప్రధాన కెమెరా, 50ఎంపీ అల్ట్రా వైడ్ షూటర్‌తో వస్తోంది. సెల్ఫీ కోసం ముందువైపు 50ఎంపీ సెల్ఫీ కెమెరా అమర్చారు. ఫేస్ అన్‌లాక్ ఫీచర్, సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సదుపాయాలు ఉన్నాయి. IP48 రేటింగ్‌తో తీసుకొచ్చారు. బ్లూటూత్ 5.4, యూఎస్‌బీ టైప్‌సీ పోర్ట్ వంటి కనెక్టివిటీ ఫీచర్లు ఉన్నాయి. 4,700mAh బ్యాటరీతో తీసుకొచ్చారు. 68W వైర్డ్ టర్బోపవర్, 30W వైర్‌లెస్, 5W రివర్స్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది.

రేజర్ 60 అల్ట్రా 16జీబీ+ 512జీబీ వేరియంట్ ధర రూ.99,999గా కంపెనీ నిర్ణయించింది. ఎంపిక చేసిన బ్యాంక్ కార్డుల ద్వారా కొనుగోలు చేస్తే రూ.10వేలు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ అందిస్తోంది. అంటే రూ.89,999కే కొనుగోలు చేయొచ్చన్నమాట. అర్హులైన వారికి 12 నెలల పాటు నో కాస్ట్ ఈఎంఐ సదుపాయం అందించనుంది. మౌంటైన్ ట్రయల్, రియో రెడ్, స్కారాబ్ రంగుల్లో లభిస్తుంది. కంపెనీ అధికారిక వెబ్‌సైట్, రిలయన్స్ డిజిటల్, అమెజాన్ వెబ్‌సైట్లతో పాటు రిటైల్ దుకాణాల ద్వారా కొనుగోలు చేయొచ్చు. మే 21 నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి.






## పాక్‌తో సరిహద్దు ఉన్న నగరాలకు పలు విమానాలు రద్దు

**జమ్మూ, శ్రీనగర్ సహా పలు సరిహద్దు నగరాలకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా, ఇండిగో ప్రకటించాయి.**

కాల్పుల విరమణ ఒప్పందం జరిగినప్పటికీ పాకిస్థాన్ ఇంకా దాడులకు యత్నిస్తున్నట్లే కన్పిస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో సోమవారం రాత్రి మళ్లీ డ్రోన్లు కనిపించినట్లు కథనాలు వచ్చాయి. దీంతో అక్కడి ప్రజలు మరోసారి భయాందోళనకు గురవుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశీయ విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న నగరాలకు పలు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఎయిర్‌ఇండియా, ఇండిగో ప్రకటించాయి.

''తాజా పరిణామాలు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జమ్మూ, లేహ్, జోధ్‌పుర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, చండీగఢ్, రాజ్‌కోట్ నగరాలకు మంగళవారం (మే 13) విమాన రాకపోకలు నిలిపివేస్తున్నాం. పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు ప్రకటిస్తాం'' అని ఎయిర్ ఇండియా తమ ప్రకటనలో వెల్లడించింది.

అటు ఇండిగో కూడా ఇదే విధమైన ప్రకటన చేసింది. ''ప్రయాణికుల భద్రతే మాకు అత్యంత ప్రాధాన్యం. దీని వల్ల మీ ప్రయాణ ప్రణాళికలకు అంతరాయం ఏర్పడినప్పటికీ రద్దు చేయక తప్పట్లేదు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణ చెబుతున్నాం'' అని కంపెనీ పేర్కొంది. శ్రీనగర్, లేహ్, రాజ్‌కోట్, చండీగఢ్, జమ్మూ, అమృత్‌సర్ ప్రాంతాలకు ఇండిగో విమాన సర్వీసులను నిలిపివేసింది. వాస్తవానికి సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు కాస్త సద్దుమణిగినట్లు అనిపించడంతో సోమవారం నుంచి 32 ఎయిర్‌పోర్టులను తిరిగి అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో విమాన సేవలను పునరుద్ధరించేందుకు ఎయిర్‌లైన్లు కూడా సిద్ధమయ్యాయి. అయితే, జమ్మూకశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో సోమవారం రాత్రి డ్రోన్ల కదలికలు కన్పించాయి. అటు పంజాబ్‌లోని జలంధర్‌లో ఓ నిఘా డ్రోన్‌ను కూల్చివేసినట్లు సైనిక బలగాలు ప్రకటించాయి. కలవరపడాల్సిందేమీ లేదని, పరిస్థితి పూర్తి నియంత్రణలోనే ఉందని వెల్లడించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దిల్లీ నుంచి అమృత్‌సర్‌కు వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని కొంతదూరం వెళ్లాక తిరిగి వెనక్కి మళ్లించారు. అనంతరం విమాన సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. ఎయిర్‌ఇండియా కూడా ఇదే నిర్ణయాన్ని వెల్లడించింది.



# కొత్త వారసుడు.. ఎన్టీఆర్ చిత్రానికి శ్రీకారం

నందమూరి కుటుంబం నుంచి నాలుగో తరం వెండితెరపైకి అడుగు పెడుతోంది. నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు.. తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు వైవీఎస్ చౌదరి ఓ చిత్రానికి శ్రీకారం చుట్టారు. నందమూరి కుటుంబం నుంచి నాలుగో తరం వెండితెరపైకి అడుగు పెడుతోంది. నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు.. తారక రామారావును హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు వైవీఎస్ చౌదరి ఓ చిత్రానికి శ్రీకారం చుట్టారు. న్యూ టాలెంట్ రోర్స్ పతాకంపై వైవీఎస్ సతీమణి గీత నిర్మిస్తున్నారు. తెలుగమ్మాయి వీణా రావు కథానాయిక. ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నారా భువనేశ్వరి క్లాప్ కొట్టగా.. దగ్గుబాటి పురందేశ్వరి, గారపాటి లోకేశ్వరి కెమెరా స్విచ్చాన్ చేశారు. నందమూరి సుహాసిని మిగతా కుటుంబ సభ్యులు చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందించారు. నందమూరి మోహనకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి రామకృష్ణ తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ..** "సీనియర్ ఎన్టీఆర్ నటుడిగా ఎంత కీర్తి తెచ్చుకున్నారో.. తారక రామారావు కూడా అలాగే ఎదగాలని కోరుకుంటున్నా. రామ్ తన ఉనికిని చాటుకోవడం కోసం ఎంతో కష్టపడుతున్నాడు. ఆ తపన ఉన్నవారంతా కచ్చితంగా పేరుని సొంతం చేసుకుంటారు" అన్నారు. "మా నాన్న ఎన్టీఆర్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి ఆయన కుమారులు, మనవళ్లు ఎంతో కృషి చేస్తున్నారు. వాళ్లంతా స్టార్లుగా ఎదిగారు. ఇప్పుడు ఇండస్ట్రీలోకి వస్తున్న ఆయన మునిమనవణ్ని కూడా అందరూ ప్రోత్సహించాలని కోరుతున్నా" అన్నారు లోకేశ్వరి.

**పురందేశ్వరి మాట్లాడుతూ..** "మా నాన్న ఎన్టీఆర్ కళాతపస్వి. ఆయన పేరును భారతీయ సినీ రంగంలో సువర్ణాక్షరాలతో లిఖించారు. ఆ తర్వాత బాలకృష్ణ, హరికృష్ణ, కల్యాణ్ రామ్, ఎన్టీఆర్.. ఇలా ప్రతి ఒక్కరూ చిత్రసీమపై చెదరని ముద్ర వేశారు. అలాగే ఇప్పుడీ ఎన్టీఆర్ కూడా పరిశ్రమలోకి వస్తున్నారు. తనకు కూడా కళామతల్లి ఆశీర్వాదంతో పాటు కుటుంబ సభ్యుల ఆశీసులూ ఉంటాయ"న్నారు.

**హీరో తారక రామారావు మాట్లాడుతూ..** "మా ముత్తాత ఎన్టీఆర్, మా తాత హరికృష్ణ, మా నాన్న జానకిరామ్ ఆశీసులు ఎప్పుడూ నాతో ఉంటాయని నేను నమ్ముతున్నా. వాళ్లు దివి నుంచి ఈ వేడుకను చూసి సంతోషిస్తారనుకుంటున్నా. ఈరోజు నా కుటుంబ సభ్యులంతా నన్ను ప్రోత్సహించడానికి ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రేక్షకుల ప్రేమాభిమానాలే నన్ను ముందుకు నడిపిస్తాయని నమ్ముతున్నా" అన్నారు.

**అనంతరం దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ..** "ఈ రోజుని నా జీవితంలో మర్చిపోలేను. ఎన్టీఆర్ ఘాట్ నాకు పుణ్యక్షేత్రంతో సమానం. ఎన్టీఆర్ కుటుంబంలోని నాలుగోతరానికి చెందిన వ్యక్తి.. ఆయన పేరు పెట్టుకున్న మునిమనవడు ఎన్టీఆర్ సినిమా ప్రారంభోత్సవం ఈ ప్రదేశంలో జరగడం నాకెంతో ఆనందంగా ఉంది. ఈ చిత్రంతో హైందవ సంస్కృతి, తెలుగు సంస్కృతి, సంప్రదాయం, సాహిత్యం గొప్పదనం గురించి ప్రేక్షకులకు చెప్పనున్నాం. ఇది తప్పకుండా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నా. దీనికి కీరవాణి సంగీత దర్శకుడిగా, సాయిమాధవ్ బుర్రా మాటల రచయితగా, చంద్రబోస్ గీత రచయితగా పని చేస్తున్నార"న్నారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు కల్యాణ్ చక్రవర్తి, మురళీ మోహన్, చంద్రబోస్, కోదండ రామిరెడ్డి, బి.గోపాల్, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, భీమనేని శ్రీనివాసరావు, బీవీఎస్ఎన్ ప్రసాద్, కేఎస్ రామారావు,భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

తారక రామారావు చిత్రపరిశ్రమలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. అతడు గొప్ప విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. "ఎన్టీఆర్ మునిమనవడు తారక రామారావు సినిమా ప్రారంభోత్సవం చూసి గర్వంగా, భావోద్వేగంగా అనిపించింద"ని నారా లోకేశ్ పోస్ట్ పెట్టారు. అతడు ఎన్నో విజయాలు అందుకోవాలని.. నందమూరి వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. తారక రామారావు నటనలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని.. తెలుగు సినిమా గర్వపడేలా చేయాలని నారా బ్రాహ్మణి పేర్కొన్నారు.

# నాన్నా చెప్పరు... నేనూ చెప్పను!

**అగ్ర దర్శకుడు శంకర్ కుమార్తె అదితి శంకర్ తమిళంలో కథానాయికగా పరిచయమై అక్కడ వరుసగా సినిమాలు చేస్తున్నారు.**



అగ్ర దర్శకుడు శంకర్ కుమార్తె అదితి శంకర్ తమిళంలో కథానాయికగా పరిచయమై అక్కడ వరుసగా సినిమాలు చేస్తున్నారు. 'భైరవం' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ కథానాయకులుగా... విజయ్ కనకమేడల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా అదితి శంకర్ సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

'తెలుగు సినిమాల్లో నటించాలని ఎప్పట్నుంచో ఉండేది. రామోజీ ఫిల్మ్‌సిటీతోపాటు తెలుగు రాష్ట్రాల్లో మా నాన్న ఎక్కడ చిత్రీకరణలు చేసినా, ఆయనతో కలిసి వచ్చేదాన్ని. నా సినిమా కోసం ఇక్కడికి వచ్చి చిత్రీకరణలో పాల్గొంటానని అప్పట్లో అస్సలు ఊహించలేదు. తెలుగు నుంచి అవకాశం రావడంతో నా కల నిజమైన అనుభూతి కలిగింది. తమిళంలో చేసిన తొలి సినిమాని దర్శకుడు విజయ్ కనకమేడల చూశారట. 'భైరవం'లోని పాత్రకి నేనైతే బాగుంటానని ఆయన నమ్మారు. ఆయనే ఫోన్ చేసి ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పారు".

"నా వ్యక్తిత్వానికి దగ్గరగా ఉండే పాత్రలోనే నేను కనిపిస్తా. ధైర్యం, నిజాయతీ, ఉత్సాహం మేళవింపుతో కూడిన పాత్ర అది. సినిమాలోని కథ, అందులో పాత్ర బాగుందంటే కచ్చితంగా నటిస్తా. ఈ సినిమా విషయంలో ఆ రెండూ సంతృప్తినివ్వడంతో మరో మాట లేకుండా నటించడానికి అంగీకారం తెలిపా. భాష పరంగానే అడ్డంకులు ఎదురవుతాయేమో అనుకున్నా. కానీ మా దర్శకుడు విజయ్, రచయిత సత్య చాలా సాయం చేశారు. పైపెచ్చు ఇందులో ముగ్గురు కథానాయకులూ తమిళం బాగా మాట్లాడతారు. దాంతో ఈ సినిమా ప్రయాణం నాకు మరింత సౌకర్యంగా అనిపించింది. తెలుగు సినిమాలు చూస్తుంటా. నేను థియేటర్‌లో చూసిన తొలి సినిమా 'మగధీర'. అదే నాకు అత్యంత ఇష్టమైన చిత్రం. ఆ సినిమాతో దర్శకుడు రాజమౌళి, కథానాయకుడు రామ్‌చరణ్‌కి పెద్ద అభిమానిగా మారిపోయా". "మంచు మనోజ్ నాకు ముందే తెలుసు. ఆయన తొలి రోజు సెట్‌కి వచ్చి 'ఇక్కడేం చేస్తున్నావ్' అని అడిగారు. ఇందులో నేను నటిస్తున్నానని చెప్పా. ఆయనతో ఇలా సరదా సరదాగా ఉండేది సెట్‌లో వాతావరణం. సాయి శ్రీనివాస్‌ని పాట చిత్రీకరణలోనే తొలిసారి కలిశా. ఆయనది అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తిత్వం. నారా రోహిత్ కూడా చాలా మంచి మనిషి. ముగ్గురూ గొప్ప నటనని ప్రదర్శించారు. విజయ్ స్పష్టత కలిగిన దర్శకుడు. సెట్‌లో మంచి వాతావరణాన్ని సృష్టించేవారు. నిర్మాత రాధామోహన్ రోజూ చిత్రీకరణకి వచ్చేవారు. ఆయనకు మంచి అభిరుచి ఉంది. నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. ఇందులో డ్యాన్స్‌కి ప్రాధాన్యమున్న రెండు పాటలు ఉన్నాయి. ఆ రెండూ నాకు ఇష్టమైనవే. శ్రీచరణ్ సంగీతం చాలా బాగుంది". "దర్శకుడు శంకర్ కూతురు అనే గుర్తింపుని ఓ గౌరవంగా భావిస్తాను కానీ, అది నాపై ఒత్తిడి పెంచుతుందని ఎప్పుడూ అనుకోను. మా నాన్నకి నేను చేస్తున్న సినిమాల గురించి ఏమీ తెలియదు. ఆయన సినిమాలతోనే ఆయన బిజీగా ఉంటారు. ఆయన సినిమాలకి సంబంధించిన విశేషాలు కూడా మాకు అస్సలు చెప్పరు. సినిమాని ఓ పసిపాపలా జాగ్రత్తగా చూసుకుంటుంటారు. అయితే, నా సినిమాల్ని మాత్రం నాన్న తప్పకుండా చూడాల్సిందే. ఆయనకి మరో ఆప్షన్ లేదంతే (నవ్వుతూ). చూడకపోతే ఫైట్ చేస్తుంటా. నేను చేసే సినిమాలకి సంబంధించిన ప్రతి విషయాన్నీ మా అమ్మకి చెబుతుంటాను. నాకు చారిత్రక కథలన్నా, పీరియాడిక్ చిత్రాలన్నా ఎంతో ఇష్టం. సవాళ్లు ఎదుర్కొనే మహిళ పాత్రలో నటించడమన్నా ఇష్టమే. నటిగా ఈ ప్రయాణంలో చాలా సవాళ్లే ఉన్నాయి కానీ, అవన్నీ మంచి అనుభవాల్నే పంచుతున్నాయి".

# రామ్‌చరణ్‌తో కామన్‌వెల్త్ బాక్సింగ్ ఛాంపియన్: ఫొటోలు వైరల్



**కామన్‌వెల్త్ బాక్సింగ్ ఛాంపియన్ జూలియస్, రామ్‌చరణ్ మీట్ అయ్యారు. సంబంధిత ఫొటోలు నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.**

ప్రముఖ హీరో రామ్‌చరణ్ లండన్ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలోనే మాజీ బాక్సర్ జూలియస్ ఫ్రాన్సిస్ ఆయన్ను మంగళవారం కలిశారు. బాక్సింగ్ బెల్ట్‌ను తన భుజంపై వేయమని చరణ్‌ను జూలియస్ కోరారు. సంబంధిత ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. బ్రిటిష్ హెవీ వెయిట్ ఛాంపియన్‌గా 5 సార్లు, కామన్వెల్త్ ఛాంపియన్‌గా 4 సార్లు సత్తా చాటారు జూలియస్.

కష్టం ఎదురైన ప్రతిసారీ ఒంటరిగా కూర్చోండి: పూరి జగన్నాథ్ లండన్‌లోని ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఏర్పాటైన తన మైనపు విగ్రహావిష్కరణకు రామ్‌చరణ్ లండన్ వెళ్లారు. కొన్ని రోజుల క్రితం జరిగిన ఆ వేడుకలో ఆయనతోపాటు కుటుంబం పాల్గొంది. చరణ్ మైనపు విగ్రహంలో ఆయనతో పాటు తన పెంపుడు కుక్క రైమ్ కూడా ఉండటం విశేషం. ఇలా పెంపుడు జంతువుతో కలిసి ఉన్న **మైనపు విగ్రహం కలిగిన రెండో సెలబ్రిటీ (తొలి వ్యక్తి రాణి ఎలిజబెత్ 2) రామ్ చరణ్.**



# 'బ్యాడ్‌బాయ్ కార్తీక్' పూర్తి చేశాడు

నాగశౌర్య కథానాయకుడిగా... శ్రీ వైష్ణవి ఫిలింస్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'. విధి కథానాయిక. రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మాత.

నాగశౌర్య కథానాయకుడిగా...
శ్రీ వైష్ణవి ఫిలింస్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'. విధి కథానాయిక. రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనివాసరావు చింతలపూడి నిర్మాత. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తామని సినీ వర్గాలు తెలిపాయి. సముద్రఖని, సీనియర్ నరేశ్, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, వెన్నెల కిశోర్, బ్రహ్మాజీ, పృథ్వీ, అజయ్, ప్రియ, నెల్లూరు సుదర్శన్, కృష్ణుడు, చమక్‌చంద్ర, శివన్నారాయణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హారిస్ జైరాజ్, కళ: రామాంజనేయులు, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు, ఛాయాగ్రహణం: రసూల్ ఎల్లోర్.

# సైనికుల మాతృమూర్తులకు కంటిమీద కునుకుండదు అలియాభట్



**సైనికులు, వారి మాతృమూర్తుల త్యాగాలను స్మరిస్తూ బాలీవుడ్ నటి అలియాభట్ ఎమోషనల్ పోస్టు పెట్టారు.**

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, పాక్ రెచ్చగొట్టే చర్యలు వంటి పరిణామాలతో దేశం ఒకరకమైన ఉద్విగ్న పరిస్థితులను ఎదుర్కొంది. సైన్యం పాక్‌కు దీటుగా బదులిచ్చినందుకు దేశ ప్రజలు గర్వపడ్డారు. కానీ, ఆ సైనికులను పంపిన తల్లులు మాత్రం అనుక్షణం ఊపిరి బిగపట్టుకొని, తమ బిడ్డ కోసం కలవరపడుతూనే ఉన్నారు.. ఉంటారు. ఇదే విషయాన్ని ప్రముఖ బాలీవుడ్ నటి అలియాభట్ ఒక ఎమోషనల్ పోస్టు ద్వారా వ్యక్తం చేశారు.

"కొన్ని రోజులుగా పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నిశ్శబ్దమే వినిపించింది. అంతా ఆందోళన. ప్రతి మాట, వార్త వెనక ఒకరకమైన టెన్షన్. ఆదివారం మనమంతా మదర్స్ డేను సంతోషంగా చేసుకున్నాం. ఆలింగనాలు ఇచ్చి పుచ్చుకున్నాం. దేశ రక్షణ కోసం హీరోలను పెంచిన తల్లుల గురించి ఆలోచించకుండా ఉండలేకపోయా. వారిది అంతులేని త్యాగం. ప్రతి సైనికుడి యూనిఫామ్ వెనక నిద్ర లేని రాత్రులు గడిపే అతడి తల్లి ఉంటుంది. తన బిడ్డకు ఏ రాత్రి జోలపాటలా ఉండదని ఆ తల్లికి తెలుసు. అనిశ్చితి.. ఒత్తిడితో కూడిన ఆ నిశ్శబ్దం ఏ క్షణమైనా బద్దలు కావొచ్చు. కానీ.. ప్రతి రాత్రి ఉద్రిక్తతలు లేని ప్రశాంతతను కోరుకుంటున్నాం. ఆ తల్లిదండ్రుల ధైర్యం ఈ దేశాన్ని ఎంతగానో కదిలిస్తోంది. పంటి బిగువున బాధను నొక్కిపెట్టిన వారికి ప్రతిక్షణం అండగా ఉంటాం. మా రక్షకుల కోసం, ఈ దేశం కోసం కలిసి నిలబడతాం. జైహింద్" అంటూ సుదీర్ఘ పోస్టు పెట్టారు.

గతనెల 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మృతిచెందిన విషయం తెలిసిందే. అందుకు ప్రతీకారంగా భారత ఆర్మీ 'ఆపరేషన్ సిందూర్' పేరిట మెరుపుదాడులకు దిగింది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. కానీ పాక్ మాత్రం రెచ్చగొట్టే చర్యలకు యత్నించింది. నేరుగా ఎదుర్కోలేక అసత్య ప్రచారానికి పాల్పడింది. కానీ వాటన్నింటికి మన సైన్యం దీటుగా బదులిచ్చింది.



# డీజేలు, చీర్ లీడర్స్ వద్దు..

## ఐపీఎల్ పునః ప్రారంభంపై సునీల్ గావస్కర్

ఐపీఎల్ 2025 సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లను వినోద కార్యక్రమాలు లేకుండా నిర్వహించాలని భారత మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ కోరారు. అందుకు గల కారణాన్ని ఆయన వివరించారు.

ఇటీవల భారత్, పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల్లో మన దేశానికి చెందిన కొంతమంది పౌరులు, సైనికులు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తమ ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు సంఘీభావంగా ఐపీఎల్ 2025 సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లను వినోద కార్యక్రమాలు లేకుండా నిర్వహించాలని భారత మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ కోరారు. దాయాది దేశంతో ఉద్రిక్తతల వల్ల మే 8న ఆగిన ఐపీఎల్.. ఈ నెల 17 నుంచి పునః ప్రారంభం కానుంది. 'పాక్ దురాగతంతో కొన్ని కుటుంబాలు తమ సన్నిహితులను, ప్రియమైన వారిని కోల్పోయాయి. ఆ కుటుంబాలకు గౌరవసూచకంగా ఐపీఎల్ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లను హంగూ ఆర్భాటాలు లేకుండా నిర్వహించాలని నేను హృదయపూర్వకంగా ఆశిస్తున్నాను. ఆట వరకే పరిమితం కావాలి. ప్రేక్షకులను అనుమతించండి. కానీ, చీర్ లీడర్స్, ఓవర్ల మధ్యలో డీజే పాటలు వద్దు. తమ ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలను గౌరవించడానికి నిజంగా ఇది మంచి మార్గం' అని సునీల్ గావస్కర్ అన్నారు.

డబ్ల్యూటీసీ ఫైనల్.. ఐపీఎల్‌లో ఆ జట్లకు షాక్! ఐపీఎల్ 2025లో మిగిలిన 17 మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్ విడుదల అయింది. మే 17 నుంచి మ్యాచ్‌లు తిరిగి ప్రారంభంకానున్నాయి. మొత్తం ఆరు వేదికల్లో (బెంగళూరు, జైపూర్, దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ, అహ్మదాబాద్) మ్యాచ్‌లు జరుగుతాయి. రెండు ఆదివారాలు డబుల్ హెడ్డర్ మ్యాచ్‌లు ఉంటాయి. మే 29 క్వాలిఫయర్ 1, 30న ఎలిమినేటర్, జూన్ 1న క్వాలిఫయర్ 2, జూన్ 3న ఫైనల్ నిర్వహించనున్నారు. అయితే, ప్లే ఆఫ్స్ మ్యాచ్‌ల వేదికలు ఇంకా ఖరారు చేయలేదు.





# గిల్ వద్దు.. టీమిండియా కెప్టెన్‌గా అతడే సరైనోడు!

ప్రస్తుతం క్రికెట్ ప్రపంచం దృష్టి మొత్తం టీమిండియా మీద కేంద్రీకృతమై ఉంది. కెప్టెన్ రోహిత్ శర్మ తో పాటు దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత.. వారి స్థానాల్ని భర్తీ చేసేదెవరన్న చర్చ నడుస్తోంది. కాగా గత కొంతకాలంగా సంప్రదాయ ఫార్మాట్లో ఘోర పరాభవాలు చవిచూసిన భారత జట్టు.. తదుపరి ఇంగ్లండ్‌ను ఢీకొట్టనుంది.

ఇరు జట్ల మధ్య ఈ మేర ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌తో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 202527 ఆరంభం కానుంది. ఇంగ్లండ్ వేదికగా జరిగే ఈ కీలక సిరీస్‌కు టీమిండియా ఈసారి రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి లేకుండానే వెళ్లనుండటం ఆసక్తిగా మారింది.

పనిభారం పడకుండా ఉండేందుకే? ఇక ఈ సిరీస్ నుంచి యువ బ్యాటర్ శుబ్‌మన్ గిల్ టీమిండియా టెస్టు కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టడం దాదాపు ఖాయమైపోయిందనే వార్తలు వస్తున్నాయి. ప్రధాన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాపై పనిభారం పడకుండా ఉండేందుకే భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

బుమ్రా కూడా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించే క్రమంలో తనకు తానుగా కెప్టెన్సీ రేసు నుంచి తప్పుకొన్నాడని మరికొన్ని వార్తలు. ఈ పరిణామాల నేపథ్యంలో టీమిండియా దిగ్గజ క్రికెటర్ సునిల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

టెస్టు కెప్టెన్‌గా బుమ్రానే సరైనోడు టీమిండియా టెస్టు కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్‌ను కాదని.. బుమ్రాకే పగ్గాలు అప్పగించాలని సన్నీ అభిప్రాయపడ్డాడు. ''ప్రతి ఒక్కరు పనిభారం అంటూ బుమ్రా గురించి ఏదేదో మాట్లాడేస్తున్నారు. నిజానికి అతడికి మాత్రమే ఈ వర్క్‌లోడ్ గురించి పూర్తిగా తెలుస్తుంది. తన శరీరం ఒత్తిడిని తట్టుకోగలదా? లేదా ? అనేది బుమ్రాకు మాత్రమే తెలుస్తుంది.

ఆ కారణంతో కెప్టెన్సీ నుంచి పక్కన పెట్టడం సరికాదు. ఎందుకంటే కెప్టెన్‌గా ఇతరులు ఎవరు ఉన్నా.. బుమ్రాతో అదనపు ఓవర్లు వేయించాలనే చూస్తారు. మరి అలాంటపుడు పనిభారం పెరగదా?

జట్టులో బుమ్రా నంబర్ వన్ బౌలర్. తనే కెప్టెన్‌గా ఉంటే ఎప్పుడు విరామం తీసుకోవాలి.. ఎప్పుడు బరిలోకి దిగాలనే విషయాల్లో వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకోగలడు. అందుకే నా వరకైతే జస్‌ప్రీత్ బుమ్రానే తదుపరి టెస్టు కెప్టెన్‌గా నియమించాలి.

పనిభారం అంటూ వచ్చే ఊహాగానాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఏం చేయాలో బుమ్రాకు బాగా తెలుసు. కెప్టెన్‌గా అతడే ఉండటం అత్యుత్తమ నిర్ణయం అని నా అభిప్రాయం'' అని గావస్కర్ స్పోర్ట్స్ టుడేతో వ్యాఖ్యానించాడు.

గతంలోనూ నాయకుడిగా కాగా బుమ్రా గతంలో ఓసారి ఇంగ్లండ్ పర్యటనలో టెస్టు జట్టు నాయకుడిగా వ్యవహరించాడు. ఆ తర్వాత ఇటీవల ఆస్ట్రేలియాతో బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా తొలుత పెర్త్‌లో.. ఆఖరిగా సిడ్నీలో ఐదో టెస్టులో కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు.

అయితే, సిడ్నీ టెస్టు సందర్భంగా వెన్నునొప్పి తిరగబడటంతో దాదాపు మూడు నెలల పాటు ఆటకు దూరమయ్యాడు. ఐపీఎల్2025తో ఇటీవలే పునరాగమనం చేశాడు. ఇదిలా ఉంటే.. జూన్ 20 నుంచి టీమిండియా ఇంగ్లండ్ మధ్య టెస్టు సిరీస్ మొదలుకానుంది.




# ఇంగ్లాండ్‌కు పెద్ద బూస్ట్: మొయిన్ అలీ

ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ముంగిట రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలికారు. ఇది తమ జట్టుకు కలిసొస్తుందని ఇంగ్లాండ్ మాజీ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ అన్నాడు.

ఐదు టెస్టుల సిరీస్ కోసం జూన్‌లో టీమ్‌ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ సిరీస్‌తోనే 20252027 డబ్ల్యూటీసీ ప్రారంభంకానుంది. అయితే, ఇటీవల స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించారు. వీరిద్దరూ లేకపోవడం తమ జట్టుకు పెద్ద బూస్ట్‌ను ఇస్తుందని ఇంగ్లాండ్ మాజీ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ అన్నాడు. కోహ్లీ రిటైర్మెంట్ ప్రకటించడం టెస్టు క్రికెట్‌కు పెద్ద దెబ్బ అని పేర్కొన్నాడు.

'కచ్చితంగా ఇది (రోహిత్, కోహ్లీ రిటైర్మెంట్) ఇంగ్లాండ్‌కు పెద్ద బూస్ట్ ఇస్తుందని భావిస్తున్నా. ఈ ఇద్దరు అగ్రశ్రేణి ఆటగాళ్లకు ఇంగ్లాండ్‌లో ఆడిన అనుభవం ఉంది. టీమ్‌ఇండియా చివరగా ఇక్కడకు వచ్చినప్పుడు రోహిత్ బాగా ఆడినట్లు నాకు గుర్తుంది. రోహిత్, కోహ్లీ టెస్ట్ క్రికెట్‌లో భారత్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. వారు రిటైర్ కావడం భారత జట్టుకు తీరని లోటు. కోహ్లీ వీడ్కోలు పలకడం టెస్టు క్రికెట్‌కు పెద్ద దెబ్బ. అతను ఒక మార్గదర్శకుడు, టెస్ట్ క్రికెట్‌కు ఎంతో సేవ చేశాడు. భారత్‌లో మరింత మెరుగ్గా రాణించాడు. అప్పట్లో సచిన్ తెందూల్కర్‌ను చూడటానికి స్టేడియాలకు అభిమానులు పోటెత్తెవారు. తర్వాత అది కోహ్లీకే సాధ్యమైంది. అతని పేరిట అద్భుతమైన రికార్డులున్నాయి. కోహ్లీ ఆడుతుంటే చూస్తూనే ఉండాలనిపిస్తుంది. చాలా పోటీతత్వంతో ఆడతాడు. అద్భుతమైన కెప్టెన్ కూడా. అతను రిటైర్ అవడం టెస్టు క్రికెట్‌కు పెద్ద దెబ్బ' అని మొయిన్ అలీ అన్నాడు.

# ఆధ్యాత్మిక గురువు ఆశీస్సులు తీసుకున్న కోహ్లీ, అనుష్క శర్మ

**బృందావన్ ధామ్‌లో ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ మహారాజ్ ఆశీస్సులను కోహ్లీ, అనుష్క శర్మ తీసుకున్నారు.**

విరాట్ కోహ్లీ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడు. సోమవారం టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్‌మెంట్ ప్రకటించాడు. దీంతో 14 సంవత్సరాల టెస్ట్ కెరీర్‌కు అతడు ముగింపు పలికినట్లైంది. భారత్ టీ20 వరల్డ్ కప్ గెలిచాక విరాట్ పొట్టి ఫార్మాట్ నుంచి తప్పుకున్న విషయం తెలిసిందే. కోహ్లీ ఇప్పుడిక కేవలం వన్డే క్రికెట్‌లోనే కొనసాగుతున్నాడు.

టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలిగినట్లు ప్రకటించిన మరుసటిరోజే విరాట్ కోహ్లీ, తన భార్య అనుష్కశర్మతో కలిసి ఓ ఆధ్యాత్మిక కేంద్రాన్ని సందర్శించారు. ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్ ధామ్‌కు వెళ్లిన ఈ జంట ప్రేమానంద్ మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. వీరు గతంలోనూ చాలాసార్లు ఈ ఆశ్రమాన్ని సందర్శించారు. టెస్ట్ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ తర్వాత కోహ్లీ పాల్గొన్న మొదటి వ్యక్తిగత కార్యక్రమం ఇది. దీంతో ఈ ఫొటోలు, వీడియోలను అభిమానులు సోషల్‌మీడియాలో తెగ షేర్ చేశారు.



# డబ్ల్యూటీసీ ఫైనల్.. ఐపీఎల్‌లో ఆ జట్లకు షాక్!




ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా మధ్య డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. ఈ మ్యాచ్ ప్రభావం ఐపీఎల్‌పై పడనుంది.

**లార్డ్స్ వేదికగా జూన్ 11-15 మధ్య ప్రపంచ టెస్టు** ఛాంపియన్ షిప్ ఫైనల్ జరగనుంది. తుది పోరులో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తలపడనున్న విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికా 12 టెస్ట్‌ల్లో 8 విజయాలతో 69.44 పాయింట్లతో అగ్రస్థానంలో, ఆస్ట్రేలియా 19 మ్యాచ్‌ల్లో 13 విజయాలతో 67.54 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి తుది పోరుకు అర్హత సాధించాయి. ఈ కీలక మ్యాచ్ కోసం ఇవాళ ఉదయం ఆస్ట్రేలియా తమ జట్టును ప్రకటించగా కాసేపటి క్రితం దక్షిణాఫ్రికా కూడా టీమ్‌ను ప్రకటించింది. తెంబా బావుమా కెప్టెన్‌గా 15 మందితో టీమ్‌ను ఎంపిక చేశారు. గాయం కారణంగా కొంతకాలంగా టెస్టులకు దూరమైన లుంగి ఎంగిడి తిరిగి జట్టులోకి వచ్చాడు.

**ఐపీఎల్.. ఆ టీమ్‌లపై ప్రభావం**

డబ్ల్యూటీసీ ఫైనల్ ప్రభావం ఐపీఎల్ (IPL)పై పడనుంది. పలు జట్లు కీలక ఆటగాళ్లను సేవలను కోల్పోయే ఛాన్స్ ఉంది. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం దక్షిణాఫ్రికా ప్రకటించిన 15 మంది ఆటగాళ్లలో ఎనిమిది మంది ప్రస్తుతం ఐపీఎల్‌లో ఆడుతున్నారు. వారెవరంటే.. రికెల్‌టన్, కోర్బిన్ బాస్ (ముంబయి), లుంగి ఎంగిడి (ఆర్సీబీ), ట్రిస్టన్ స్టబ్స్ (దిల్లీ), మార్కో యాన్సెన్ (పంజాబ్), మార్‌క్రమ్ (లఖ్‌నవూ), కగిసో రబాడ (గుజరాత్), వియాన్ ముల్డర్ (హైదరాబాద్). ఆసీస్ డబ్ల్యూటీసీ జట్టులో ఉన్న కమిన్స్, ట్రావిస్ హెడ్ (హైదరాబాద్), హేజిల్‌వుడ్ (ఆర్సీబీ), జోష్ ఇంగ్లిస్ (పంజాబ్), మిచెల్ స్టార్క్ (దిల్లీ) ఐపీఎల్‌లో ఆడుతున్నారు. ఇందులో ముంబయి, ఆర్సీబీ, దిల్లీ, లఖ్‌నవూ, పంజాబ్ జట్లకు ప్లే ఆఫ్స్ అవకాశాలున్నాయి. మరోవైపు, భారత్, పాక్ ఉద్రికత్తలతో ఇప్పటికే చాలామంది విదేశీ ఆటగాళ్లు స్వదేశానికి వెళ్లిపోయారు. ఒకవేళ వారు భారత్‌కు తిరిగి వచ్చినా డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడాల్సి ఉన్న ఆటగాళ్లు ఐపీఎల్‌లో తాము ప్రాతినిధ్యం వహించే జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరితే అందుబాటులో ఉండకపోవచ్చు.

**సౌతాఫ్రికా జట్టు: తెంబా బావుమా (కెప్టెన్), టోనీ డి జోర్జి, ఐడెన్ మార్‌క్రమ్, వియాన్ ముల్డర్, మార్కో యాన్సెన్, కగిసో రబాడ, కేశవ్ మహరాజ్, లుంగి ఎంగిడి, కోర్బిన్ బాష్, కైల్ వెరినే, డేవిడ్ బెడింగ్‌హామ్, ట్రిస్టన్ స్టబ్స్, ర్యాన్ రికెల్‌టన్. సెనురన్ ముత్తుసామి, డేన్ ప్యాటర్సన్.**

**ఆస్ట్రేలియా జట్టు: పాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కారీ, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, సామ్ కాన్‌స్టాస్, మ్యాట్ కునెమన్, మార్నస్ లబుషేన్, నాథన్ లైయన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్. ట్రావెలింగ్ రిజర్వ్: బ్రెండన్ డగెట్.**